## 26న తెలుగు వర్సిటీలో కొలకలూరి పురస్కారాలు ప్రదానోత్సవం

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 17 : తెలుగు భాషా సాహిత్యాలకు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ కుటుంబ సభ్యులు గత 17సంవత్సరాలుగా సాహితీశ్రేష్ఠులకు ప్రదానం చేస్తున్న కొలకలూరి పురస్కారాలను 2024 సంవత్సరానికి గాను శనివారం ప్రకటించారు. కొలకలూరి భగీరథ కథానిక పురస్కారాలకు గాను కామునికంత కథారచయిత హుమయున్ సంఘీర్‌ను, కలుంకూరి గుట్ట రచయిత కేవీ మేఘనాథ రెడ్డిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారానికి గాను అడవి బతుకులు రచయిత డాక్టర్ దిలావర్‌ను, నిర్మాల్యం రచయిత సింహప్రసాద్‌ను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారని వెల్లడించారు. కొలకలూరి రమయ్య విమర్శన పురస్కారాలకు తాత్త్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామమం రచయిత డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డిని, నవలా హృదయం-3 రచయిత వి.రాజా రామ్మోహనరావు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రతీ విభాగంలోనూ ప్రథమ పురస్కారగ్రహీతకు 15వేల నగదు, ద్వితీయ పురస్కారగ్రహీతకు 5వేల నగదుతో సత్కరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 26న సాయంత్రం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, సుమకిరణ్ తెలిపారు.

## త్రోబాల్ నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్ ఆట ప్రతినిధి, ఫిబ్రవరి 17 : రాష్ట్ర త్రోబాల్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. శనివారం యూసుఫ్‌గూడలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎమ్)లో ఎన్నికలు జరిగాయి. ఇందులో త్రోబాల్ సంఘం నూతన అధ్యక్షుడిగా నవీన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్ చారి, కోశాధికారిగా వెంకట్ ఎన్నికయ్యారు. సాట్స్ నుంచి కోచ్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, జాతీయ త్రోబాల్ సంఘం నుంచి మధు పరిశీలకులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్, శ్రీనివాస్, చక్రపాణి, లవకుమార్, నవ్య, కుముదిని పాల్గొన్నారు.

## బయోలాజికల్ సైన్స్‌తోనే భవిష్యత్తు

### పద్మవిభూషన్ ప్రొఫెసర్ ఎంఎం శర్మ, నాసీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అశోక్ మిశ్రా

జవహర్‌నగర్, ఫిబ్రవరి 17 : బయోలాజికల్ సైన్స్‌తోనే దేశ భవిష్యత్తు ముందుకు సాగుతుందని పద్మవిభూషన్ ప్రొఫెసర్ ఎంఎం శర్మ, నాసీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అశోక్ మిశ్రా అన్నారు. బిట్స్ పిలానీ క్యాంపస్‌లో ఎన్ఎంటీఈ2ఏ-2024 ఆధ్వర్యంలో ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్, టెక్నాలిజీస్‌పై రెండవ అంతర్జాతీయ సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. మురుగునీటిని మంచి నీటిగా మార్చడంతో కాలుష్యాన్ని తగ్గించవచ్చని, బయో ఇంధనాన్ని సృష్టిస్తూ దేశ ప్రజలకు అవసరమయ్యే ఇంధనాన్ని అందజేయాలని, పాలిమర్స్‌తో నూతన వంగడాలను తయారు చేస్తూ తక్కువ ఖర్చులో పాలిమెరిక్ మెటీరియల్స్ సృష్టించాలని సూచించారు. పలు విద్యాసంస్థలు, పరిశోధన కంపెనీల నుంచి సుమారు 250మంది హాజరయ్యారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఏఆర్‌సీఐ, టీసీఎస్, హెచ్‌బీఎల్ వంటి సంస్థలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో హరేందర్‌సింగ్, బిట్స్ పిలానీ మాజీ డైరెక్టర్ సుందర్, ప్రొఫెసర్ శ్రీధర్, సత్యపాల్, పూర్ణిమా తదితరులు పాల్గొన్నారు.

శతజయంతి వేడుకల్లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

# ప్రస్తుత రాజకీయాలు చూస్తే.. చెన్నమనేని ఆత్మ ఘోషిస్తుంది

పోస్టల్ కవర్‌ను ఆవిష్కరిస్తున్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎంపీ వినోద్ కుమార్, తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 17 : ప్రస్తుత రాజకీయాలు చూస్తే చెన్నమనేని ఆత్మ ఘోషిస్తుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. చెన్నమనేని జీవిత భావితరాలకు ఆదర్శనీయం' అని వక్తలు అన్నారు. నెక్లెస్‌రోడ్‌లోని నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో చెన్నమనేని రాజేశ్వర్ రావు, లలితా దేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దివంగత చెన్నమనేని రాజేశ్వర్ శతజయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టల్ కవర్, 'చట్టసభల్లో మూడు దశాబ్దాల ప్రజావాణి చెన్నమనేని' అనే పుస్తకాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎంపీ బోయిన పల్లి వినోద్ కుమార్, మజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, కుందూరు జానా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చెన్నమనేని రమేశ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సభ మర్యాదలు మరిచి మాట్లాడే వారినే గౌరవించే పరిస్థితి నెలకొందని తెలిపారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. చెన్నమనేని జీవిత విశేషాలతో రూపొందించిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో చెన్నమనేని రాజశ్వేర్ రావు కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## జాలువారిన కళాత్మక చిత్రాలు

కళాకారుల చేతుల నుంచి జాలువారిన కళాత్మక చిత్రాలు మాదాపూర్‌లోని చిత్రమయి ఆర్ట్ గ్యాలరీలో కొలువుదీరాయి. న్యూస్ ఆర్ట్ ఫెస్ట్ పేరిట శనివారం నిర్వహించిన చిత్ర ప్రదర్శనను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయెర్, ఎంఈఐఎల్ చైర్‌పర్సన్, డైరెక్టర్ సుధారెడ్డి ప్రారంభించారు. ఇందులో దేశ నలు మూలలకు చెందిన 300 మంది ప్రముఖ కళాకారులు పాల్గొని 320కి పైగా చిత్రాలను ప్రదర్శించారు.

- మాదాపూర్, ఫిబ్రవరి 17

సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్మికురాలు

## జీహెచ్ఎంసీని సందర్శించిన సఫాయి కర్మచారి చైర్మన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ) : శానిటేషన్ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని, వారికి దక్కాల్సిన హక్కులు, సదుపాయాలను సమకూర్చాలని జాతీయ సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్ అన్నారు. శనివారం జీహెచ్ఎంసీని సందర్శించిన ఆయనకు బల్దియాలోని కార్మిక సంఘాలు, కార్మికులు వినతి పత్రాలను అందజేశారు. అయితే ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి జీహెచ్ఎంసీ చేపట్టిన కార్యాచరణను బల్దియా కమిషనర్ రొనాల్డ్ రాస్ వివరించారు. కార్మికుల జీతభత్యాలు, సమయపాలన, ఈఎస్ఐ, యూనిఫాం, వైద్య సదుపాయాలు, పని దినాల గురించి అడిగి తెలుసుకున్నారు. బీఓటీ టాయిలెట్లు, సులభ్ కాంట్రాక్టులు ఇవ్వడం లేదని, ఆయా కాంట్రాక్టులను రీకాల్ చేసి మేతకాని కార్మికులకు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా జాతీయ మేతకాని వాల్మీకి శ్మశాన వాటిక నిర్మాణానికి రూ.79లక్షలు మంజూరు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు ఉపేందర్ రెడ్డి, సరోజ, జోనల్ కమిషనర్లు వెంకటేశ్, అభిలాష అభినవ్, వెంకన్న, రవికిరణ్, సీఎంఅండ్‌హెచ్‌ఓ డా.పద్మజ, డా.రాంబాబు, ఎస్‌బీఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై ఉన్న బసవేశ్వరుడి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీ సురేశ్ పట్కార్, మాడపు వీర మల్లేశ్

# ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడికి పూజలు

కవాడిగూడ, ఫిబ్రవరి 17 : తమ ఆరాధ్య దైవమైన బసవేశ్వరుడికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం బసవేశ్వరుడికి సాంస్కృతిక సారథి బిరుదు ప్రధానం చేస్తూ మంత్రివర్గం తీర్మానం చేయడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న బసవేశ్వరుడి విగ్రహం వద్ద జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీ సురేశ్ పట్కర్, తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ సికింద్రాబాద్ అధ్యక్షుడు మాడపు వీర మల్లేశ్, ప్రధాన కార్యదర్శి కోట గుండప్ప, వీరశైవ లింగాయత్ మహాసభ, యువ రాష్ట్రీయ బసవ దళ్, సమస్త లింగాయత్ సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు.

## శ్రీలంకలో సత్తాచాటిన పద్మ

హైదరాబాద్ ఆట ప్రతినిధి, ఫిబ్రవరి 17 : అంతర్జాతీయ యోగా పోటీల్లో శంషాబాద్‌కు చెందిన తమ్మినేని పద్మ సత్తాచాటింది. కొలంబో(శ్రీలంక) వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ యోగా ఫెస్టివెల్ చాంపియన్‌షిప్‌లో పద్మ స్వర్ణ పతకంతో మెరిసింది. మహిళల 41-50 వయస్సు విభాగంలో విజేతగా నిలిచిన పద్మకు శ్రీలంక ప్రభుత్వ అధికారులు ట్రోఫీ, స్వర్ణ పతకం, ప్రశంస పత్రం అందజేశారు. శనివారం స్వస్థలం చేరుకున్న ఆమెకు స్థానిక క్రీడాభిమానులు ఘన స్వాగతం పలికారు.

■ చిగురాకు పుస్తకావిష్కరణ

తెలంగాణ భవన్‌లో చిగురాకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్. చిత్రంలో మీర్‌పేట డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

- బడంగ్‌పేట, ఫిబ్రవరి 17

## పతంజలి సుమధు యాప్‌కు ప్రథమ బహుమతి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17 : తేనె స్వచ్ఛతను, నాణ్యతను పరీక్షించడానికి పతంజలి ప్రవేశపెట్టిన సుమధు యాప్‌నకు నిమ్స్‌మే ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ హనీ కీపింగ్ జాతీయ సెమినార్‌లో ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా పతంజలి పరిశోధకులు ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ పతంజలి వినియోగిస్తున్న ఆల్ బేస్డ్ సొల్యూషన్ తేనె ప్రామాణికతను, శాస్త్రవేత్తల పారదర్శకతను ప్రపంచానికి చాటిందని అన్నారు.

## సమన్వయంతోనే సమర్థవంతమైన కమ్యూనికేషన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ) : మీడియా విభాగాల మధ్య సమన్వయంతోనే ప్రభుత్వ కమ్యూనికేషన్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా ఉంటుందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శనివారం నాంపల్లిలోని గోకుల్‌నగర్, బజార్ ఘాట్ వద్ద జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని కేంద్ర ప్రసార, మీడియా విభాగాల అధిపతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పీఐబీ, సీబీసీ, డీపీడీ, డీడీ, ఏఐఆర్, సీబీఎఫ్‌సీ తెలంగాణ శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారిలో అవగాహన పెంచాలన్నారు. కాగా ఇటీవల కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరమే తెలంగాణలో పర్యటించారు.

# హర్యానాలో కురుమ సంఘం భవనం

### స్థల కేటాయింపునకు కృషి చేస్తా : గవర్నర్ బండారు దత్తాత్రేయ

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, తదితరులు

అబిడ్స్, ఫిబ్రవరి 17 : హర్యానా రాష్ట్రంలో కురుమ సంఘం భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం ద్వారా కేటాయించేందుకు కృషి చేస్తానని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ముస్లింజంగ్ వంతెన వద్ద గల రాష్ట్ర కురుమ సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ డెలిగేట్స్- 2024 సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. షెపర్డ్ ఇండియా సమావేశం తెలంగాణ రాష్ట్రంలో జరుపుకోవడం శుభ పరిమాణమని, కురుమలు రాజకీయంగా రాణించి, చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ కర్నాటక మంత్రి హెచ్ఎం రేవన్న మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 12 కోట్ల మంది కురుమలు ఉన్నారని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా కురుమలను పిలుచుకుంటారని తెలిపారు. ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో దశల వారీగా కురుమ వసతి హాస్టల్ భవనాలను నిర్మించి అందులో అకాడమిక్ స్టడీ సర్కిల్‌లను ఏర్పాటు చేసి నిరుపేద కురుమలకు ఐఏఎస్, ఐపీఎస్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోకాపేటలో నిర్మించిన కురుమల ఆత్మగౌరవ భవనాన్ని ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనుండగా ఢిల్లీలో నిర్వహించాల్సిన ఈ డెలిగేట్స్ సమావేశం రాష్ట్ర కురుమ సంఘం భవనంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏహెచ్ విశ్వనాథ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బూరుగడ్డ నాగేశ్, క్యామ మల్లేశం, రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, ఉపాధ్యక్షులు రెక్కాల కొండల్‌రాజ్, కొలుపుల నరసింహ, కోశాధికారి కట్ట మల్లేశం, రేవల్లి ప్రకాశ్, కేజీ కృష్ణమూర్తి, ఎక్కాల కన్నా, రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూముకుంట అరుణ్‌కుమార్, శివకుమార్, కాలె అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలోని బుక్ ఫెయిర్‌కు హాజరైన పాఠకులు

## పుస్తక పఠనంతోనే జీవితంలో వెలుగులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : తల్లిదండ్రులు పిల్లలతో స్వయంగా పుస్తకాలు చదించాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. పుస్తక పఠనంతోనే జీవితంలో వెలుగులు నిండుతాయని చెప్పారు. ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన 36వ జాతీయ పుస్తక ప్రదర్శనను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. డిజిటల్ ప్రపచంలోనూ పుస్తకాలకు ఆదరణ పెరుగుతుందని అన్నారు. యువతీ, యువకులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి పుస్తకాలు చదవడం ఆసక్తిగా మలుచుకోవాలని సూచించారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి పలు పుస్తకాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, వాసు తదితరులు పాల్గొన్నారు. కాగా, రేపటితో పుస్తక పఠనం ముగియనుంది. వీకెండ్ కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. రవ్వా శ్రీహరి వేదికపై జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ మాట్లాడారు. వాస్తవానికి దగ్గరగా.. మట్టి వాసనను పరిమళించే విధంగా తన రచనలు ఉంటాయన్నారు. ఇప్పటి వరకు 250 కథలు, 7 నవలలు, వెయ్యి వ్యాసాలు, 4 నాటకాలు, 8 కథా సంపుటాలు వెలువరించినట్లు చెప్పారు.

## 14 బహుజన పుస్తకాల ఆవిష్కరణ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17 : బహుజన సాహిత్యాన్ని విస్తృతం చేసే కార్యక్రమాన్ని ప్రొఫెసర్లు, అధ్యాపకులు, టీచర్లు, బహుజన మేధావులు చేపట్టాలని మాజీ ఎంపీ, బీసీసీఈ చైర్మన్ తూళ్ళ దేవేందర్ గౌడ్ పేర్కొన్నారు. బీసీ సీఈ ఇన్‌చార్జి ఇంద్రవెళ్లి రమేశ్ నిర్వహణలో రవ్వా శ్రీహరి వేదికపై 14 బహుజన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ సింహాద్రి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మురళి మనోహర్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు భంగ్యా భుక్యా, ప్రొఫెసర్ ఇ.వెంకటేశ్, దళిత నాయకులు జేబీ రాజు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, బీసీ ఉద్యమ నేత సమ్మయ్య, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, కార్యదర్శి ఆర్.వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాప్రియదర్శినిలో అంతర్జాతీయ సదస్సు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 17 : విద్యార్థులకు విద్యతో పాటు పలు అంశాలపై సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ కాన్ఫరెన్స్ హబ్ సహకారంతో తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, కళాశాల కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ అమ్తుల్ వాహబ్ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై నాల్గవ అంతర్జాతీయ సదస్సును జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించారు. ఈ సదస్సులో అంతర్జాతీయ స్థాయిలో 11 దేశాల నుంచి, దేశంలోని 24 రాష్ట్రాలకు చెందిన 1239 మంది రచయితలు, 234 బృందాలు, 48 విశ్వ విద్యాలయాలు, 102 కళాశాలలు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వరలక్ష్మి, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ జాయింట్ డైరెక్టర్‌లు డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్, జి.యాదగిరి, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ బాల భాస్కర్, కోకన్వీనర్ డాక్టర్ ఆసియా జబీన్, తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి బాడీ బిల్డింగ్ పోటీలు

హైదరాబాద్ ఆట ప్రతినిధి, ఫిబ్రవరి 17 : గచ్చిబౌలి అథ్లెటిక్స్ స్టేడియం వేదికగా ఈ నెల 19న బాడీబిల్డింగ్ పోటీలు మొదలుకానున్నాయి. దీంతో పాటు మిస్టర్ ఇండియా ట్రయల్స్ జరుగనున్నాయి. టోర్నీలో టైటిల్ విజేతకు రూ.50వేల ప్రైజ్‌మనీ దక్కనున్నది. టోర్నీలో పోటీ పడాలనుకునే వారు రూ.3వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9908197123 సంప్రదించాలని నిర్వాహకుడు మాజీ మిస్టర్ ఇండియా విన్నర్ రవికుమార్ తెలిపారు.

## సైన్స్ టీచర్లకు సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో పాఠాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ) : చిన్నారులకు సైన్స్ పాఠాలను నేర్పించే ఉపాధ్యాయులకు సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా నాలెడ్జ్ అండ్ అవేర్‌నెస్ మ్యాపింగ్ ప్లాట్‌ఫాం ద్వారా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.